# 16 ఏళ్లు

విమల ఇంట్లో పనంతా చేసుకుపోతున్నా లోపల మనసులో ఎంతో విసుగ్గా ఉంది. ఎన్నో రకాల ఆలోచనలు బుర్రలో రొద చేస్తున్నాయి. ఎన్నో ప్రశ్నలు నిలేస్తు న్నాయి. జవాబుల కోసం ఆమె ఆలోచనలు వెతుక్కుంటున్నాయి. ఒక్కొక్క ప్రశ్నా మహా బరువుగా జవాబు తోచినదిగా కనిపిస్తోంది.

ఇంత ఆలోచనలోనూ విమలను ఆశ్చర్యపరుస్తున్న విషయం ఒకటుంది. అదే మంటే తనింతకాలం తన గురించి తను ఏ మాత్రం ఆలోచించకుండా ఎలా ఉన్నదా అని.

తన ఆలోచననీ, తన శక్తినీ, తన సమర్థతనీ ఎప్పుడూ అంచనా వేసుకునే సమయమే రాలేదా ? లేక తను అలాంటి ప్రయత్నమే చేయలేదా ? ఏమో ? ఇప్పుడేది ఆలోచించినా గందరగోళంగా ఉంది. ఏదో సమయం మించి పోయిన ఫీలింగ్ బాధిస్తోంది. విమల ఆలోచనలు ఆమె జ్ఞాపకాల వైపు మళ్లిపోతున్నాయి.

అవును, అప్పుడామెకి పదహారేళ్లు. అందం, ఆరోగ్యం ఆమె సొత్తు. అప్పట్లో ఆమెను ఆడవాళ్లయినా చూపు మరల్చుకోలేక మరి కాస్సేపు కన్నార్పకుండా చూసేవారు. ఆ విషయం ఆమెకీ తెలుసు. తన అందం చుట్టూ ఒక భయం చుట్టుకుని ఉండడం ఆమె గ్రహించ లేకపోయేది. విమల తల్లి మహాలక్ష్మికి కూతురి అందం మీద ఎంతో నమ్మకం, దేనికోసం ఆ నమ్మకమని ప్రశ్నిస్తే అందమైన తన కూతుర్ని ఎవరైనా కట్న కానుకలు కోర కుండా పెళ్లి చేసుకుంటారని ఆమె జవాబు.

పోతే తండ్రికి కూతురికి కట్నం బాధ ఉండదనే ఆనందం ఉన్నా పువ్వులా నాజూకుగా ఉన్నప్పుడే ఆమెని అత్యంత డబ్బున్నవాడి చేతిలో పెట్టేయ్యాలనే తపన, తాపత్రయం. అందుకే పన్నెండో ఏటనే చదువు, సంధ్యలు మానిపించి అపురూపంగా ఇంట్లో కూర్చోబెట్టారు. విమలకి చదువు అనేది లేకపోగా ఇంట్లో అపురుపమైన విలువైన విమల అందాన్ని జాగ్రత్తగా కాపాడలనే ధ్యాస తప్ప మరోకటి లేదు. అనుకున్నట్టుగానే బంధుజనంలో విమల చక్కదనం గురించి ప్రచారం జరిగింది. అందమైన కోడలు

కావాలనుకునే అత్తలు అందమైన భార్యలు కావాలనుకునే యువకులు విమల సంబంధం చూసుకుందామనే ధ్యాసలో పడ్డారు.

ఆరోజు విమల స్నేహితురాలు రమణి పుట్టినరోజు. రమణి ఇల్లు వీళ్లింటికి నాలుగు వీధులవతల. ఆ రోజు విమలకి చాలా ఆనందంగా ఉంది. రమణి ఇంటికి పుట్టిన రోజు వేడుకకు వెళ్దామని, రమణి మరీ మరీ చెప్పింది. ఎప్పుడూ అమ్మ, నాయనమ్మల ముఖాలు చూస్తూ, వారి మధ్య కొట్లాటల తిలకిస్తూ నాన్నకేకలు, తాతయ్య శాపనార్థాలు వింటూ విసిగిపోయిన ఆమెకి రమణి ఆహ్వానం ఎంతో ఉత్సాహాన్నిచ్చింది.

విమలని ఏడో క్లాసు అవగానే మానిపించేసారు గానీ రమణి చదువు కొనసాగించం వల్ల అప్పుడే పదో క్లాసు రాసింది. అయితే విమలకి తను చదువుకోలేక పోయాననే బాధ బొత్తిగా ఉండేది కాదు. ఇంట్లో ఆడవాళ్ల చదువుకోకపోవడం అతి సహజంగానూ, చదువుకోవడం కొంత అసహజంగానూ ఆమె కనిపించేదా రోజుల్లో.

సాయంత్రం అవుతుండగా విమల చక్కగా ముస్తాబై నుంచి బట్టలేసుకుని పందరి మీంచి స్వయంగా కోసుకున్న జాజి పూల మాల కట్టుకుని జడలో పెట్టుకుని మరికాస్త దండ రమణికి పొట్లం కట్టుకుని బయలుదేరడానికి సిద్ధమైంది.

'ఉండు, ఒక్కర్తినే ఎలా వెళ్తావు ? తమ్ముడొస్తాడు. కాస్సేపు ఆగు' అంది తల్లి.

సరేనని మళ్లీ లోపల కొచ్చి కూర్చుంది. అమ్మ అలా అన్నందుకు విమలకేం బాధ కలగలేదు. పైగా అది సహజంగానే తోచింది. 'అవును ఒక్కర్తినే ఎలా వెళ్తాను' అనుకుంది. తండ్రితో వెళ్లిన ఆరేళ్ల తమ్ముడు ఎంతకీ రాలేదు. ఆమె ఎదురు చూస్తూనే కూర్చున్నంతలో చీకటి పడిపోయింది. దీపాలూ వెలిగిపోయాయి.

ఆరేళ్ల తమ్ముడు తోడులేకపోవడం వల్ల రమణి పుట్టినరోజు పేరంటానికి విమల వెళ్లలేకపోయింది. ఉత్సాహమంతా నీరుకారిపోయింది. చేసుకున్న ముస్తాబంతా చెదిరి పోయింది.

'నే ఒక్కర్తినీ వెళ్తానమ్మా – వెళ్లగలను' అందామనుకుంది. కానీ ఏదో భయం ఆమెని ఆ మాటలననీయలేదు. ఆమె మనసులో మాట గ్రహించినట్టుగా మహాలక్ష్మి పదే పదే' ఆడపిల్లవు ఒక్కర్తివే ఎలా వెళ్తావు ? ఆ సోద్యం మనకొద్దులేమ్మా' అంటూ

దీర్ఘాలు తీసింది. తలలో పువ్వులు పూర్తిగా విచ్చుకుని సువాసనలు వెదజల్లాయి. గానీ పొట్లంలో కట్టిన దండ ఉక్కిరి బిక్కిరై వికసించకుండానే కమిలిపోవడం మొదలెట్టింది.

నాన్నా తమ్ముడూ తొమ్మిది గంటలకు ఇంటికి వచ్చారు. విమల ఫిర్యాదు చేసింది. నాన్న తను వెళ్లనందుకు ఎంతో ఆనందించాడు.

'ఆడపిల్లవు అక్కడికీ ఇక్కడికీ ఒక్కదానవూ బయలుదేరకూడదు' అంటూ సున్నితంగా హితవు చెప్పాడు.

మరోసారి ఎవరైనా తోడువస్తే వెళ్తువుగానిలే అంటూ ఆశ కూడా చూపించాడు.

ఏం ? వెళ్తే వంటరిగా ? అంది విసురుగా.

'ఏమో ? ఏదైనా కావచ్చు. ఆడపిల్లవు. అందులో అందమైన దానవు. ఎంత జాగ్రత్తగా ఉండాలి' అన్నాడు. ఇదే మాట అమ్మ, నాన్న, తమ్ముడు ఇలా చాలా మంది చాలాసార్లు అన్నట్టుగా విమలకి గుర్తే. అయితే విమల కాస్తంత చొరవ తీసుకుని 'నేను వెళ్తాను నాకు భయంలేదు' అని ఎప్పుడూ అనలేదు. తన రక్షణ భారం తను అవగింజంతైనా వహించలేకపోయింది.

విమలకి రఘురాంతో పెళ్లి కుదిరింది. అతను పెద్ద చదువు చదివాడు. డబ్బున్న వాడు. ఉద్యోగపు హోదా ఉన్నవాడు. అన్నిటికీ మించి అందమైన భార్య. ఈ సమాజం లో స్టేటస్ సింబల్ అని పూర్తిగా నమ్మినవాడు. చిన్ననాటి నుండి ఆమె సౌందర్యం ఏ కాలేజీ కుర్రాళ్ల కళ్లల్లో పడకుండా పరిరక్షింపబడిందని పూర్తిగా తృప్తిపడినవాడు. ఆడది పెద్దగా చదువుకోనక్కరలేదని విమలని భార్యగా ఎంచుకున్నాడు.

లక్ష రూపాయలు కట్నం తెచ్చే కోడళ్లు కావాల్సినంతమంది దొరుకుతారు కానీ ఇంత అందమైన పిల్ల కొడుక్కు దొరకదని గ్రహించిన అత్తగారు కట్నం వద్దని, ఉదారంగా లాంఛనాలు మాత్రం తీసుకుని ఆమెని కోడల్ని చేసుకుంది. విమల అత్తారింట్లో అగజాట్లేం పడలేదు. అత్తగారామెను ఎప్పుడూ అంటిపెట్టుకునే ఉండి అపురూపంగా చూసుకుంది. ఆమె మీద ఎవరి దృష్టీ పడకుండా కోడలి దృష్టి మరెవరి మీదా పడకుండా నిరంతర పరిరక్షణలో ఆమెని కాపాడుకుంటూ ఉంది.

భర్త వెంట బొమ్మలా తయారై అటు ఇటు వెళ్తున్నప్పుడు ఎంత ఆనందంగా ఉండాలనుకున్నా అప్పుడప్పుడు మనసు తిరగబడేది. ఏదో బందిఖానాలో వున్నట్టనిపించేది.

వీధి చివర ఆంజనేయస్వామి గుడికి వెళ్లాలన్నా కూడా తోక ఉండాల్సిందే.

'ఫర్వాలేదు నే వెళ్లొస్తాను' అని ధైర్యం చేసి అంటే

'ఏమంత బాధొచ్చింది ? మెమెవ్వరం లేనూ ఏమిటి ? అంటూ అత్తవారింట్లో ఆమెను ఎవరో ఒకరు పరిరక్షిస్తునే ఉండేవారు.

పెళ్లయిన నాలుగేళ్లకి తల్లికి సీరియస్‌గా ఉందన్న వార్త విని విమల విలవిల్లాడి పోయింది. ప్రయాణమైంది కానీ రఘురాం ఊళ్లో లేడు. ఆమె వెంట రాగల తోడు ఎవ్వరూ ఆ సమయంలో లేరు.

'ఫరవాలేదు. రైలు ఎక్కించండి వెళ్తాను' అందామనకుంది అనలేని భయం ఆమె గొంతు నొక్కింది. అంతకు ముందుగానే అత్తగారు ''వంటరిగా వెళ్లడం ఆడవాళ్లకి మంచిది కాదు'' అంటూ తేల్చి చెప్పింది.

అనుకున్న సమయానికి వెళ్లలేని విమల తల్లిని చివరి సారిగా కూడా చూడలేక పోయింది.

'అవును ఆడది వంటరిగా ఎక్కడకైనా వెళ్లడం కష్టం కాదా' అని దుఃఖాన్ని మింగుకుంది. కానీ అన్నాళ్లుగా ఆరాధించుకుంటూ అదృష్టంగా భావించుకుంటున్న ఆమె అందం మీద ఆడతనం మీద మొదటిసారి అసహ్యం వేసింది.

కాస్తంత చొరవగా నే వెళ్తానని వెళ్లి ఉంటే అమ్మనోసారి చూడగలిగేదాన్ని అనే ఊహ ఆమె హృదయంలో ముల్లులా గుచ్చుకుని ఉండిపోయింది.

ఆమె అక్కడే నిలబడిపోయినా, జీవితం కదలిపోతూనే ఉంది. మారిపోతూనే ఉంది. పిల్లలు పుట్టారు. పెరుగుతున్నారు. విమలలోని అందం తరగవలసినంత తరగ లేదు. అందుకే ఆమె భర్త రఘురాంకి భార్యను మరింత అంటి పెట్టుకునుండాల్సిన బాధ్యత పడింది.

ఎవ్వరూ లేకుండా అడుగు బయటకు పెట్టే అలవాటు ఆమెకు లేకుండా పోయింది. ఎప్పుడైనా తెగింపుగా ఈ బంగారు పంజరపు తీగెలు తెంచుకోవాలనే ఊహ కలిగినా వెంటనే.

అల్లవేళలా ఒంటరిగా వెళ్లడం ఆడవాళ్లకి మంచిది కాదనే పిరికి మందు ఎవరో ఒకరు పోస్తూనే ఉండేవారు.

వయసు పెరిగే కొద్దీ ఇతరుల నీడ నిప్పులా అనిపించసాగింది విమలకి. ఒక్క క్షణం ఏకాంతంగా నాలుగు అడుగులు నడవలేని స్థితి నరకంలా పరిణమించిందామెకి.

ఆమెలో చిన్న చిన్న కోర్కెలు ఊపిరి సలపకుండా చేయడం మొదలు పెట్టాయి. సొంతంగా బస్సెక్కాలి, సొంతంగా రైలెక్కి, కిటికీలోంచి, గిర్రున తిరిగే ప్రకృతిని చూడాలి. సినిమాకి వెళ్తే తనే ఆడవాళ్ల క్యూలో నిలబడి టికెట్ తీసుకోవాలి.

ఆలోచించే కొద్దీ ఇవన్నీ తనకి తీరని కోరికలా అని ఏడపొచ్చేది. పదహారేళ్ళ తర్వాత విమలకి ముప్పై రెండేళ్లు నిండాక వంటరిగా ఉండాలనే కోరిక పెరిగిపోయాక, అనుకోకుండా అదే ఊళ్లో ఉన్న చిన్ననాటి స్నేహితురాలు రమణి కనిపించింది. అడ్రసు తీసుకుని ఆరోజు మధ్యాహ్నం విమల ఇంటికి వచ్చింది. ఆమెని చూస్తూనే 'ఒక్కరినే వచ్చావా' అంది విమల.

'మరీ ? లేకపోతే ఎప్పుడూ ఎవరో ఒకరు జంట ఉంటారా' అంటూ నవ్వింది రమణి.

చాలా దూరం నుండి ఒంటరిగా తనకోసం. ఆ పట్టణంలో రావడం విమలకి ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. నాలుగు వీధులవతల ఈ రమణి పుట్టినరోజుకి తనెలా వెళ్ల లేకపోయిందీ గుర్తుకొచ్చి బాధ కలిగింది.

అంతమాత్రాన తను పొందిన గొప్పతనమూ లేదు. రమణి కోల్పోయిందీ లేదు. తను కాస్త చొరవ తీసుకుని ప్రపంచంలోకి ఒక అడుగు వేస్తే మరీ తన జీవితమింత స్తబ్దంగా ఉండేది కాదనిపించింది.

రమణి ఎన్నో విశేషాలు చెప్పింది. ఎంతో ధైర్యం నూరిపోసింది. ఎప్పుడూ ఎవరో ఒకరు పక్కన మనల్ని నడిపేవారు ఉండాల్సిన అవసరం లేదని చెప్పింది.

'మనం బయటికి వెళ్లినంత మాత్రాన ఏమీ అయిపోము' అంటూ స్పష్టం చేసింది. నాలుగైదుసార్లు రమణి వచ్చి వెళ్లాక విమల కాస్తంత ఆత్మస్థయిర్యం వచ్చింది. ఆలోచన పెరిగింది. ప్రపంచాన్ని మనుషుల్ని వారి భావాల్ని విమర్శతో చూడడం మొదలు పెట్టింది. తనకంటూ చదువు లేకపోవడంవల్ల తను చీకటిలో ఉండిపోయినట్లు తహతహలాడి పోయింది. నాలుగు గోడల మధ్య ఉన్న ఆడవాళ్ల పవిత్రులని భావిస్తూ బయట పనులలో తిరగే ఆడవాళ్లయందు కనబరిచే చులకన భావాన్ని గమనించిన కొద్దీ విమలలో బాధ మరీ పెరగడం మొదలైంది.

లేడీస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పువ్వుల ప్రదర్శనకి తప్పక రమ్మని మరీ మరీ చెప్పి వెళ్లింది రమణి.

రకరకాల పువ్వులు, ముఖ్యంగా గులాబీలు ఎన్ని రంగులో, ఎన్ని రకాలో చూడడానికి రెండు కళ్లు చాలవు. చూసి తీరవలసిందే. వెళ్తూ మరీ ఊరించింది.

'ఫ్లవర్ ఎగ్జిబిషన్'??? అంటే ఓహో... అక్కడా ఒక్కర్తివీ ఎలా వెళ్తావ్ ? పవన్ వస్తే తోడు తీసుకువెళ్ళు'' అన్నాడు రఘురాం.

పధ్నాలుగేళ్ల పవన్ తనకెలాంటి అంగరక్షకుడో అర్థం కాలేదు. అవును మరి. తన పదహారో ఏట ఆరేళ్ల తమ్ముడు తోడుగా ఉన్నప్పుడు ఇప్పుడు వీడు మాత్రం తోడు ఎందుకు కాదు ?

వాడు మగాడు. తమ్ముడు చిన్నవాడైనా మగాడు. కొడుకు చిన్నవాడైనా మగాడు. మగాడి నుండి ఆడదాన్ని రక్షించడానికి మగవాడే రావాలి. వాడు పసివాడైనా, ముసలివాడైనా, గుడ్డివాడైనా, కుంటివాడైనా, ఇదెక్కడి న్యాయం ?

స్త్రీ ఒక్క అడుగు చొరవ తీసుకుని తన గురించి తను ఆలోచించుకుంటే ముందుకు సాగితే తన అనుభవం తనకు దక్కుతుంది. తన జీవితం తనకి మిగులుతుంది.

రమణి మాటలు గుర్తుకు వస్తుంటే ఒక్కసారి గుండెలు నిండుగా ఊపిరి పీల్చుకోవాలనిపిస్తోంది.

అందుకే

ఉదయం నుంచి పని చేస్తున్నా మనసు మనసులో లేదు. తనింతకాలం ఇంత మొద్దు నిద్రలో ఎలా ఉండిపోయింది. ఏ అనుభవమూ, ఏ ఆలోచనా లేకుండా రాయిలా ఇన్నాళ్లు పడి ఉంది. కానీ ఇప్పుడీ మత్తు వదిలించుకోవాలి. ఈ జడత్వం నుంచి బయట పడాలి. ''నేనొక్కర్తెను ఫ్లవర్ ఎగ్జిబిషన్‌కి వెళ్లగలను, వెళ్తాను, నాకెవ్వరూ తోడూ, తోకా వద్దు. నేను వెళ్లగలను, నేను వెళ్తాను' అని గట్టిగా అరుస్తూ విమల చేసిన ప్రకటన విని ఇంట్లో అందరూ ఆమె వైపు చూసారు. ఆ గొంతు అందరూ ఆశ్చర్యంగా విన్నారు.

ఆంధ్రభూమి ప్రియదర్శిని
16-5-98